# శ్రీ షిరిడి సాయి వైభవమ్

సంచిక 5 సంపుటి 1 ఏప్రిల్, 2018





శ్రద్ధ సబూరి

సాయిదర్బార్, హైదరాబాద్

వ్యవస్థాపకులు, సలహాదారు : సాయిబానిస శ్రీరావాడ గోపాలరావు గారు

నిర్వహణ : ఆత్రేయపురపు త్యాగరాజు, నిజాంపేట, హైదరాబాద్



కాకాసాహెబ్ దీక్షిత్ డైరీ

పరామర్శ:

**ఒకసారి శ్రీసాయిబాబా శ్యామాకు స్వప్నంలో కనపడి "శ్యామా! గోవర్ధస్ దాస్ యింటికి వెళ్ళావా" అని అడిగారు. శ్యామా లేదని చెప్పగానే బాబా" గోవర్ధస్ తల్లి చనిపోయింది. వెళ్ళి అతనిని పరామర్శించు" అని చెప్పారు.**

**శ్యామాకి బాబా వాక్కుల మీద నమ్మకం. అందుచేత మరుసటిరోజు మధ్యాహ్నం 3 గంటలకు గోవర్ధస్ యింటికి వెళ్ళాడు శ్యామా. అక్కడికి వెళ్ళగానే బాబా చెప్పినమాటలు పూర్తిగా యదార్ధమని తెలిసింది. క్రితం రోజునే గోవర్ధస్ తల్లి మరణించింది. బాబా శ్యామాను సరియైన సమయానికి పంపించారు.**

భవిష్యద్వాణి.

**ద్వారకానాధ్ అనే వ్యక్తి బాబా దర్శనం కోసం షిరిడీ వచ్చాడు. అతను తన మామగారు శ్రీసాయిబాబాకు అందచేయమని ఇచ్చిన ఉత్తరాన్ని పట్టుకుని వచ్చాడు. ఆ ఉత్తరంలో ప్రధాస్ తన కూతురి అనారోగ్యం గురించి వ్రాశాడు. ద్వారకానాధ్ ఆ ఉత్తరాన్ని బాబా చేతికిచ్చాడు. బాబా దానిని తలక్రిందులుగా పట్టుకొని "ఆమె వెళ్ళిపోతున్నదన్నమాట" అంటూ గొణిగారు. నేను (కాకాసాహె దీక్షిత్) ఆమాటలు స్పష్టంగా విన్నాను. కాని మిగతావారికి అంత స్పష్టంగా వినిపించలేదు. తరువాత ఆ ఉత్తరాన్ని బాబాకు చదివి వినిపించారు. ఆ ఉత్తరం చదివిన**

తరువాత ద్వారకానాథ్ "బాబా, నాభార్యను ఎప్పుడు తీసుకుని రమ్మంటారు" అని ఆడిగాడు. అప్పుడు బాబా "ఇక నాలుగు రోజులలో ఆమే నావద్దకు వస్తుంది" అన్నారు. సరిగా నాలుగు రోజులకు ఆమె మరణించడం భక్తులందరకూ ఆశ్చర్యం కలిగించింది.

అంతర్యామి:

ఒక గురుపూర్ణిమ రోజున హేమాడ్ పంత్ సకుటుంబంగా షిరిడీకి వచ్చాడు.

రెండు రోజులలోనే అతని దగ్గర ఉన్న డబ్బంతా ఖర్చయిపోయింది. చేతిలో పైసా లేకుండా అయిపోయింది. ఒకరోజు తరువాత నేను, మోరేశ్వర్ ప్రధాన్ షిరిడీ చేరుకున్నాము. ప్రధాన్ దగ్గిర కూడా తొందరలోనే డబ్బంతా ఖర్చయిపోయింది. మరునాడు శ్రీసాయిబాబా ప్రధాన్ ని దక్షిణ అడిగారు. "నావద్ద పైసా లేదు" అని ప్రధాన్ చెప్పారు. అపుడు బాబా "అన్నా సాహెబ్ దగ్గరకు వెళ్ళి(హేమాడ్ పంత్) అడిగి పట్టుకురా" అన్నారు. హేమాడ్ పంత్ వద్ద కూడా డబ్బు లేదని ప్రధాన్ కి తెలుసు. అయినా బాబా ఆజ్ఞను తూచా తప్పక ఆచరించాలని మరొకమాట మాట్లాడకుండా ప్రధాన్ అన్నా సాహెబ్ వద్దకు వెళ్ళి డబ్బు అడిగాడు.

ప్రధాన్ తనని డబ్బు అడగగానే అన్నా సాహెబ్ ఆశ్చర్యపోయాడు. "నా వద్ద డబ్బుందని నీకెలా తెలుసు" అని హేమాడ్ పంత్ ప్రశ్నించి, ఇపుడే బాంద్రానించి ఒక వ్యక్తి వచ్చి నాకు డబ్బు ఇచ్చాడు. అని చెప్పాడు. ప్రధాన్ హేమాడ్ పంత్ ను కలుసుకోవాడానికి కొద్ది నిమిషాల క్రితమే జరిగిన ఈ విషయం ఎవరికీ తెలీదు. బాబా దివ్యదృష్టిలోని రహస్యం ఎవరికి తెలుసు?

## రక్షకుడు:

ఒక ముస్లిం భక్తుడు శ్రీసాయిబాబా వద్దకు వెళ్ళాడు. ఆ వ్యక్తికి ఒక బ్రాహ్మణ మిత్రుడు ఉన్నాడు. అతనికి మరణ శిక్షపడింది. ఆ భక్తుడు తన స్నేహితుని శిక్షనించి తప్పించమని బాబాను వేడుకున్నాడు. బాబా అతనిని ఆశీర్వదిస్తూ "నాలుగు రోజులలో భగవంతుడు అతనినిని అనుగ్రహిస్తాడు" అన్నారు. బాబా చెప్పినట్లుగానే సరిగా నాలుగు రోజుల తరువాత ఆబ్రాహ్మణ మిత్ృడు అప్పీలు మీద, మరణ శిక్ష రద్దయ్యి విడుదల చేయబడ్డాడు.

## గణేశసాయి:

శ్రీచిదంబర్ గాడ్గిల్ గణేష్ మహరాజ్ భక్తుడు. అతడు బాబా భక్తుడు కూడా. అతడు బాబాలో గణేశుడిని దర్శించేవాడు. వినాయకుని పూజించినట్లె బాబా ని కూడా పూజించాడు. అతనిలో విఘ్నేశ్వరుని మీద ఎంత భక్తి ఉందో ధృఢపరచుకోవాలనుకున్నారు బాబా. ఒకసారి గాడ్గిల్ గారు బాబాను పూజిస్తున్నపుడు, బాబా అకస్మాత్తుగా "ఈముసలివాడు చాలా టక్కరి. ఈ ముసలివానిని బయటకు తోలేయండి. నా ఆసనం క్రింద ఎలుక ఉన్నదని చెపుతున్నాడు" అన్నారు.శ్రీసాయిబాబా తన పూజని అంగీకరించారని తాను ఆయనని గణేశునిగా భావిస్తున్నట్లు తెలుసుకొన్నారని ఆభక్తుడు చాలా అనందించాడు.

ఒకరోజు మధ్యాహ్నం నన్ను (దీక్షిత్) ప్రదాస్ ఏమైనా వచ్చాడా అని బాబా అడిగారు. నేను రాలేదని చెప్పాను. ప్రధాస్ ని షిరిడీకి రమ్మని కబురు పంపమంటారా అని బాబాని అడిగాను.

అలాగే కబురు పంపించు అన్నారు బాబా. బాలా షింపే ద్వారా ప్రధాన్ కి కబురు పంపించారు. అదే సమయంలో బాబా ప్రధాన్ గురించి ప్రధాన్ ని అడుగుతున్న సమయంలోనే బొంబాయి హైకోర్టులో బార్ రూములో ఎవరితోనో మాట్లాడుతున్న ప్రధాన్ హటాత్తుగా స్పృహతప్పి పడిపోయాడు. అతను నిరంతరంగా బాబానామాన్ని ఉచ్చరిస్తూనే ఉన్నాడు. అతని దగ్గర ఉన్న స్నేహితుడు వైద్య సహాయం కోసం వెళ్ళి తిరిగి వచ్చేటప్పటికి ప్రధాన్ స్పృహలోకి వచ్చాడు. కొంత సేపయిన తరువాత ఆయన ఎవరి ఆసరా, సహాయం లేకుండగానే రైలులో శాంతా క్రజ్ లోని తన యింటికి స్వయంగా తనకు తానే వెళ్ళారు.

మరునాడు బాలాషింపే అనే భక్తుడు షిరిడీనుంచి వచ్చి బొంబాయిలో ప్రధాన్ ని కలిసి బాబా ఊదీ, నేను రాసిన ఉత్తరం ప్రధాన్ కి అందచేశాడు. క్రితం రోజు బాబా ప్రధాన్ ని తలచుకున్న విషయం కూడా చెప్పాడు. బాబా తననెందుకు తలుచుకున్నారో ప్రధాన్ కి అర్ధమయింది. బాబా తన భక్తుడు కష్టంలో ఉంటే వెంటనే ఎలా తమ రక్షణను అందచేస్తారో అనేదానికి ఇదొక చక్కని దృష్టాంతం.

## స్వప్న సందేశం:

శాంతాక్రజ్ లో నిర్మించిన దేవాలయంలో వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్టించాలని ఎం.డబ్ల్యు. ప్రధాన్ సంకల్పించి దానికి బాబాని ఆహ్వానించమని షిరిడీలో ఉన్న నాపేరు మీద బాబాకు ఉత్తరం రాశాడు. ఈ ఉత్తరంలోని విషయమంతా నేను బాబాకు వివరించి చెప్పాను. బాబా దానికి సమ్మతించారు. బాబా అంగీకరించారని తెలుపుతూ నేను ప్రధాన్ కి ఉత్తరం వ్రాశాను. అదేరోజు ప్రధాన్ మరదలు శ్రీమతి థాయిబాయికి స్వప్నం వచ్చింది. ఆస్వప్నంలో ఆమెకు ఎవరో వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నట్లుగా కనపడింది. మరుసటిరోజు ఉదయాన్నే ఆమె

తనకు వచ్చిన స్వప్న వృత్తాంతం అందరికీ చెప్పింది. కొంతసేపటి తరువాత ప్రధాన్ కి నేను రాసిన ఉత్తరం అందింది. ఆవిధంగా బాబా తన సమ్మతిని నాఉత్తరం చేరడానికి ముందే ఎలా తెలియచేసారో చూపించి అతని నమ్మకాన్ని మరింతగా బలపరిచారు.

### ఊదీమందు:

ఒకసారి నేను ఆఫీసులో పని చేసుకుంటున్నపుడు నాస్నేహితుడు వచ్చి తనకు గత 8 రోజులనుంచి ఒక్క నిమిషం కూడా నిద్ర పట్టడం లేదని చెప్పాడు. డాక్టరు యిచ్చిన మందులు కూడా పని చేయలేదని తన బాధను వెళ్ళబోసుకున్నాడు. అప్పుడు నేను షిరిడీనుంచి తెచ్చిన ఊదీని అతనికిచ్చి వరుసగా మూడు రోజులు పడుకోయేముందు పెట్టుకోమని చెప్పాను. మరునాడు అతను వచ్చి ఊదీ పెట్టుకుని పడుకోగానే గాఢమైన నిద్ర పట్టిందని సంతోషంగా చెప్పాడు. బాంద్రాలో నాకు మరొక మిత్రుడు ఉన్నాడు. అతడు కూడా రెండు మాసాలుగా నిద్రలేమితో బాధ పడుతున్న తన కుమారుడిని షిరిడీకి తీసుకొని వచ్చాడు. షిరిడీ వచ్చిన రోజు రాత్రే ఆ అబ్బాయి ఎటువంటి సమస్య లేకుడా షిరిడీలో ప్రశాంతంగా నిద్రపోయాడు.

### ఉపవాసాలు వ్యర్థం:

బాబా మీద నాహృదయంలో నిండి ఉన్న ప్రేమ భక్తి వల్ల, షిరిడీ నాకు శాశ్వత స్థానమయింది. ఒకరోజు యిక జీవితాంతము రాత్రిపూట ఉపవాసం ఉందామని నిశ్చయించుకొన్నాను. ఈవిషయం నేను వాడాలో (దీక్షిత్ వాడా) అందరికీ చెప్పాను. ఆరోజున మధ్యాహ్న ఆరతి తరువాత బాబా నన్ను ఈరోజు రాత్రికి భోజనానికి ఏమి చేసుకుంటున్నావని అడిగారు. "మీరు ఏది చేయమంటే అది చేసి వడ్డిస్తానని" జవాబిచ్చాను. "మామూలే, పప్పు, పోళీ (చపాతి,

రొట్టె)" అన్నారు బాబా. అయితే రాత్రి భోజనానికి ఆ వంటకాలు తయారు చేసి ద్వారకామాయిలో నైవేద్యానికి ఇక్కడికి తీసుకురమ్మంటారా అని అడిగాను. "తయారు చేసిన వంటకాలు అక్కరలేదు. నైవేద్యం పెట్టుకుని అక్కడే వాడాలోనే తిను అన్నారు. "మీకోరిక ప్రకారం ఈరోజు రాత్రి భోజనం చేస్తాను, కాని రేపటినుంచి రాత్రిపూట ఏమీ తినకూడదని నిర్ణయించుకున్నాను" అని చెప్పాను. బాబా ఆసమయంలో నాకు సమాధానం ఇవ్వలేదు.

మరునాడు ఉదయం మరలా బాబా ముందురోజు రాత్రిలాగే నైవేద్యం పెట్టుకుని భుజించమని చెప్పారు. అప్పుడు బాబాకు ఉపవాస దీక్ష అంగీకారం కాదని అర్ధమయి ఉపవాస దీక్షను విరమించుకొన్నాను. ఆతరువాత బాబా నన్ను రాత్రి భోజనం గురించి అడగలేదు ఎందుకంటే నా దీక్షను ప్రక్కకు పెట్టి ప్రతిరోజు రాత్రి భోజనం చేయడం మొదలు పెట్టాను.

(ఇంకా ఉంది)





సాయిబానిస శ్రీరావాడ గోపాలరావుగారు రచించిన ఆనాటి ఋషులు – నేటి షిరిడీ సాయి నుండి…

సనాతన ధర్మంలో త్రేతాయుగము, ద్వాపర యుగములోని ఆనాటి ఋషులు, ఈనాటి కలియుగములోని షిరిడీ సాయి.

(గత సంచిక తరువాయి)

9. అగస్త్య మహాముని : ఈయన సప్త ఋషులలో ఒకరు. ఈయన శ్రీరామచంద్రునకు రావణునితో యుద్ధమునకు ముందు ఆదిత్యహృదయము మంత్రోపదేశముగా చేసెను. శ్రీరాముడు రావణుని ఓడించగలిగెను. ఈయన విధర్భ రాజు కుమార్తె అయిన లోపాముద్రను వివాహము చేసుకొనెను. ఈయన గొప్ప సిద్ధ వైద్యుడు కూడా. ఈయన ఉత్తర భారతదేశమునుండి వింధ్య పర్వతాలు దాటుకుంటూ దక్షిణ ద్రావిడ రాజ్యమయిన తమిళ దేశములో స్థిరపడెపోయెను. వాతాపి అనే రాక్షదుడిని తన పొట్టలో జీర్ణము చేసుకొన్న ముని. అందుచేత మనము ఎక్కువ భోజనము చేసినట్లయితే ఈమునిని తలచుకొని జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం అని అంటాము. రాక్షసులు ఈయనకు భయపడి సముద్ర గర్భములో దాగినపుడు దేవతల కోరికపై ఈ ముని ఆ సముద్రములోని నీరు త్రాగి ఆ సముద్రములో దాగివున్న రాక్షసులను బయటకు లాగెను. అగస్త్యునకు మరొక పేరు కుంభయోనిజుడు (ఈనాటి టెస్టుట్యూబ్ బేబి). కుంభమునుండి జన్మించినందువలన ఆయన

కుంభయోనిజుడయినాడు. ఒకనాడు అగస్త్య మహాముని అరణ్యములోని చెట్టుకొమ్మలకు తలక్రిందుగా వ్రేలాడుతున్న వారిని చూచి అదొక తపోవిశేషమేమోనని తలచినాడు. కాని వారందరు అగస్త్యునితో తాము ఆయన పూర్వీకులమని తమకు అగస్త్యుని సంతానము చేతనే ముక్తి లభించగలదు అని చెప్పినపుడు అగస్త్యులవారు విధర్బ రాజకుమార్తె లోపాముద్రను వివాహమాడి ఆమె ద్వారా సంతానాన్ని పొంది తన పూర్వీకులకు ముక్తిని ప్రసాదించెను. మరి శ్రీసాయి విషయములో హేమాద్రిపంత్ శ్రీ సాయి సత్ చరిత్ర 4వ.అధ్యాయములో అన్నమాటలు. “శ్రీసాయి జన్మ వృత్తాంతము ఎవరికి తెలియదు. నామదేవు, కబీరు సామాన్య మానవులవలె జన్మించి ఉండలేదు. ముత్యపు చిప్పలలో చిన్న పాపలవలే చిక్కిరి. నామదేవు భీమారధి నదిలో గోణాయికి కనిపించెను. కబీరు భాగీరధీ నదిలో తమాలుకు కనిపించెను. అట్టిదే శ్రీసాయి జన్మవృత్తాంతము. “శ్రీసాయి తల్లిదండ్రులు ఎవరు అనేది ఈనాటికి తెలియదు.

(ఇంకా ఉంది)



## షిరిడీ వార్తలు:

బొంబాయికి చెందిన బాబా భక్తుడు ఒకరు 1351 గ్రాముల బంగారు పంచవత్తుల దీపాన్ని షిరిడి సంస్థానానికి విరాళంగా అందచేసారు. దీని వెల 39 లక్షల రూపాయలు. ఆభక్తుడు ఈ దీపాన్ని షిరిడీలో శ్రీరామనవమి ఉత్సవాలు జరిగే మొదటిరోజున అందచేసారని షిరిడీ సాయి సంస్థాన్ ఎగ్జిక్యూటివ్ అధికారి శ్రీ రూబల్ అగర్వాల్ తెలియచేసారు. షిరిడీలో జరిగే ఉత్సవాల సమయాలలో ఆ భక్తుడు విరాళంగా అందచేసిన 'పంచారతి' దీపాన్ని ఉపయోగిస్తామని కూడా ఆయన తెలియచేసారు.

మార్చి 24 వ.తారీకునుండి, 26 వ.తారీకు వరకు షిరిడిలో శ్రీరామనవమి ఉత్సవాలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ మూడు రోజులలో సుమారు 3 లక్షలకు పైగా భక్తులు హాజరయారు. వీరిలో సుమారు 2 లక్షలమందికి పైగా భక్తులు ఆంధ్రా, తెలంగాణావారే కావడం విశేషం.

## దసరా ఉత్సవాలకు రాష్ట్రపతిని ఆహ్వానించడానికి సంస్థాన్ పాలకవర్గం నిర్ణయం.

ససంస్థాన్ పాలక వర్గ సమావేశంలో దసరా ఉత్సవాల సందర్భంగా భారత రాష్ట్రపతిని ప్రత్యేకంగా ఆహ్వానించాలని పాలకవర్గం నిర్ణయించింది. ఈ మేరకు ఈనెలలోనే రాష్ట్రపతి కార్యాలయానికి లేఖ వ్రాసారు. అపాయింట్ మెంట్ లభించగానే సంస్థాన్ చైర్మన్ హవారే బృందం ఆయనను కలవనున్నారు.

## కుస్తీ పోటీలు :

షిరిడీలో శ్రీరామనవమి సందర్భంగా కుస్తీ పోటీలను మార్చ్, 26 న. ఏర్పాటు చేసారు. ఈ పోటీలలో ప్రధమ బహుమతిగా రూ.2 లక్షలు, ద్వితీయబహుమతిగా రూ. 1.50 లక్షలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలను నగదు బహుమతులను విజేతలకు అందచేసారు. విశేష సంఖ్యలో కుస్తీరాయుళ్ళు హాజరయారు.

## సంస్థాన్ వారి గులాబి అగరుబత్తి వెల రూ.౩౦/-



బాబా సమాధి మందిరంలో భక్తులు బాబాకు సమర్పించే గులాబి పూలదండలను, బొకేలను గతంలో తిరిగి భక్తులకే అందజేసేవారు. బాబాను స్పృసించిన గులాబీ పూలను తిరిగి భక్తులకే అందజేయగా, ఆ పూలరేకులు మందిర ఆవరణంతా పడిపోయి భక్తులందరిచేత తొక్కబడుతూ ఉండేవి. అందుకు సంస్థాన్ వారు ఆలోచించి గులాబీ పూలదండలను, బొకేలను మళ్ళీ భక్తులకే ఉపయోగించేందుకు, వారిలో భక్తిభావాన్ని పెంపొందించేందుకు, వాటితో గులాబీ అగరువత్తులను తయారు చేయడానికి సంస్థాన్ వారు నిర్ణయం తీసుకున్నారు. అందుకోసం సంస్థాన్ వారే దానికి సంబంధించిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి గులాబీ అగరువత్తులను తయారు చేసి విక్రయిస్తున్నారు. మంచి సువాసన గల ఈ అగరుబత్తీ పాకెట్లను రూ.30/- లకు విక్రయిస్తున్నారు. భక్తులు ఈ అగరుబత్తీలను విశేషంగా కొనుగోలు చేస్తున్నారు.



## సాయి ఉపాసక్ కలం నుండి ::

శ్రీ సాయి సత్ చరిత్ర నిత్యపారాయణ భక్తులకు దిశానిర్దేశం చేస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు. నిత్యపారాయణ చేయడమే కాదు, చేసిన వెంటనే అందులోని ఘట్టాలను మరల మననం చేసుకుంటూ ఉంటే ఆయన తత్వం మన మనసులలో నిక్షిప్తమయి ఉంటుంది. ఆ కాలంలో మనం కూడా భక్తులందరిలోను ఒకరుగా మసీదులో బాబా ఎదుట ఉన్నట్లుగా ఊహించుకోవాలి.



మనం ఆయన లీలను చదివిన, విన్నా వాటిని కూడా నిరంతరం గుర్తు చేసుకుంటూ ఉండాలి. ఆయన నామ స్మరణ నిరంతరం చేసుకుంటూ ఉండాలి. దాని ఫలితంగా భక్తి భావాలు మరింతగా మనలో పెరుగుతాయి. సాయి నిత్యం మనతోడూ నీడగా ఉంటారు.

*ఓమ్ సాయిరామ్ సాయిబంధువులందరికి ఒక ముఖ్య గమనిక.*

మే నెల 25వ. తారీకున అమెరికాలోని అట్లాంటాకు వెడుతున్న సందర్భంగా మేనెల సంచికను కాస్త ముందుగానే విడుదల చేస్తాను. జూన్ నెలనుండి అట్లాంటానుంది మన పత్రికను ప్రచురిస్తూ ఉంటాను.

మీ మిత్రులు, బంధువులకు కూడా మన పత్రిక మైల్ ద్వారా పంపించదలచుకున్నాను. అందుచేత వారి పేర్లు, మైల్ ఐడి లు క్రింద ఉదహరించిన మైల్ ఐ డి కి పంపినట్లయితే వారికి కూడా పంపిస్తాను.

మీ సలహాలు, సూచనలను ఈ క్రింద ఉదహరించిన మైల్ ఐ.డి కి పంపగలరు

saidarbar@gmail.com

@@@@@